సాక్షి మహబూబాబాద్

ఆదివారం | 4 | మే | 2025



నేడు 'నీట్'

దేశ వ్యాప్తంగా వైద్య విద్యాకోర్సుల్లో ప్రవేశాలకు జాతీయ స్థాయి అర్హత ప్రవేశ పరీక్ష నీట్ -యూజీ -25ను నేడు (ఆదివారం) నిర్వహించనున్నారు.

- IIలో▸



9 ప్యాసింజర్ రైళ్లు రద్దు

సిబ్బంది కొరత వల్ల కాజీపేట నుంచి వెళ్లే పలు ప్యాసింజర్ రైళ్లను శనివారం నుంచి రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

- IIలో▸

గరిష్టం/కనిష్టం
40⁰ /26⁰

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు, ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

మద్యం..చోద్యం!

వాళ్లకు ఎంజాయ్‌మెంట్.. వీళ్లకు పనిష్‌మెంట్

- బహిరంగ ప్రదేశాల్లో మందుబాబుల హల్‌చల్
- ప్రధాన రహదారుల వెంబడి తిష్ట
- అటువైపుగా వెళ్లాలంటే భయపడుతున్న మహిళలు
- 'సాక్షి' విజిట్‌లో తేలిన నిజాలు



శనిగపురం రోడ్డు వెంచర్‌లో మద్యం బాటిల్స్



సిగ్నల్ కాలనీలోని ఇళ్ల మధ్య ఖాళీ స్థలంలో మద్యం తాగుతున్న వ్యక్తి



నర్సంపేట బైపాస్‌రోడ్డులో వైన్‌షాపు మెట్లపైనే మద్యం తాగుతున్న మందుబాబులు

సాక్షి, మహబూబాబాద్/ మహబూబాద్ అర్బన్/ మహబూబాబాద్ రూరల్/ నెల్లికుదురు/ నెహ్రూసెంటర్: మందుబాబులకు ఎంజాయ్‌మెంట్.. మహబూబాబాద్ పట్టణ ప్రజలకు పనిష్‌మెంట్‌గా మారింది. మందు తాగేందుకు వైన్స్, పర్మిట్ రూములు, బార్లు ఉన్నా.. కొందరు ఇళ్ల మధ్యలోని ఖాళీ స్థలాలు, మరికొందరు రోడ్డు మీదనే మద్యం తాగడం ఫ్యాషన్‌గా మారింది. విచ్చలవిడిగా మద్యం తాగి అటువైపుగా వచ్చిన విద్యార్థులను, మహిళలను ఇబ్బంది పెడుతున్న సంఘటనలూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి 7 నుంచి 9 గంటల వరకు పట్టణంలో పలు ప్రాంతాలను 'సాక్షి'విజిట్ చేసింది. ఇందులో పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి.

- మహబూబాబాద్ పట్టణంలోని ఇల్లెందు బైపాస్ మిల్లుల వెనకాల ఖాళీ స్థలం, నందినగర్ వెంచర్, రాంచంద్రాపురం కాలనీ, డబుల్ బెడ్ రూం ఇళ్ల ప్రాంతం, నందనా గార్డెన్, మిషన్ భగీరథ ట్యాంకు, చెరువు కట్ట, మహర్షి స్కూల్ పక్కన ఉన్న ఖాళీ స్థలాల్లో గుంపులుగుంపులుగా కూర్చొని మందు సేవించడం కంట పడింది. అటువైపు నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు మహిళలు ఇబ్బందులు పడాల్సి వస్తుందని, భయంభయంగా వెళ్తున్నామని మహిళలకు చెబుతున్నారు.
- వివేకానంద సెంటర్, బస్టాండ్, నర్సంపేట బైపాస్‌రోడ్డులోనే అత్యధికంగా వైన్స్ ఉన్నాయి. షాపుల్లో మద్యం తీసుకొని పక్కనే రోడ్డు మీద ఉండి మద్యం సేవిస్తున్నారు. దీంతో వెంకట్రామ టాకీస్‌సందు, బతుకమ్మ ఘాట్, హన్మంతుడిగడ్డ, బెస్త బజార్ వైపు వెళ్లే మహిళలను, విద్యార్థినులను చూసి సూటిపోటీ మాటలనడంతో రాత్రి అయితే అటు వైపు వెళ్లడం లేదు. అదేవిధంగా లేడీస్ టైలర్లు ఎక్కువగా ఆ ప్రాంతాల్లోనే ఉండటంతో.. అక్కడికి వచ్చిన మహిళలను ఇబ్బందులు పెడుతున్నారని మహిళలకు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- మూడుకోట్ల సెంటర్‌లోని వైన్స్ వద్ద నుంచి మందు తీసుకొని పక్కనే ఉన్న గల్లీలోకి వెళ్లి మద్యం తాగుతూ అటువైపుగా వెళ్తున్న మహిళలను కామెంట్ చేస్తున్నారని, ఖాళీ సీసాలు విసిరి వేయడం, ఇళ్ల ముందు బాటిల్స్ పెట్టడం, రాత్రి వరకు గొడవలు పెట్టుకుంటున్నారని మహిళల చెబుతున్నారు. ఏమైనా అంటే గొడవలకు దిగడం, బెదిరించిన సంఘటనలు కూడా ఉన్నాయి.
- ఫాతిమా స్కూల్ ముందు గ్రౌండ్, బాబునాయక్ తండాకు వెళ్లేదారి దారిలో ఉన్న ఖాళీ స్థలాలు సాయంత్రం అయితే చాలు బార్లను తలపించే విధంగా గుంపులుగుంపులుగా ఉంటున్నారని స్థానికులు చెబుతున్నారు. గుండ్ల బోడు తండా ముందు వెంచర్‌లో మద్యం సేవించి రోడ్డుమీద ఉన్న కూరగాయల షాపుల్లోకి వచ్చిన మహిళల పట్ల అసభ్యంగా మాట్లాడుతున్నారని, దీంతో సాయంత్రం అయితే అటుగా రావాలంటే భయపడుతున్నారని, కూరగాయల గిరాకీ తగ్గిందని మహిళలు చెబుతున్నాను.

మహిళలతో అసభ్యకరంగా మాట్లాడుతున్నారు..



గుండ్ల బోడుతండా ఎదురు వెంచర్‌లో సాయంత్రం అయితే చాలు మందు సీసాలతో వచ్చి ఇక్కడే తాగడం, మహిళలపై అసభ్యకరంగా మాట్లాడటంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. పోలీసులు గస్తీ పెంచి ఈ ప్రాంతంలో మద్యం తాగకుండా చూడాలి.

- గుగులోత్ లలిత, కూరగాయల వ్యాపారి

ఇళ్ల మధ్య మద్యం తాగకుండా చూడాలి



ఇళ్ల మధ్య మద్యం సేవించి ఇబ్బందులు పెడుతున్న సంఘటనలు పట్టణంలో చోటు చేసుకుంటున్నాయి. పోలీసులు ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించాలి. వైన్స్, బార్లు మినహా ఇతర ప్రాంతాల్లో మద్యం తాగుతున్న వారిపై చర్య తీసుకోవాలి.

- తిరుపతమ్మ, పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు

తాగిన మైకంలో ఇబ్బందులు..



మహబూబాబాద్ పట్టణంలోని రైల్వేగేటు, నందనాగార్డెన్ ప్రాంతం, వర్తక సంఘం వెంచర్లలో మద్యం తాగి అటుగా వచ్చిన మహిళలను, వి ద్యార్థులను ఇబ్బందులు పెట్ట డం, భయ భ్రాంతులకు గురి చేస్తున్నారు. పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి మహిళలకు రక్షణ కల్పించాలి.

- ధార హిందూ భారతి, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి

న్యూస్‌రీల్

సమస్యల పరిష్కారమే లక్ష్యం



డోర్నకల్: రైల్వే ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మజ్దూర్ యూనియన్ పనిచేస్తోందని ఆ యూనియన్ సికింద్రాబాద్ డివిజనల్ సెక్రటరీ రవీందర్ తెలిపారు. స్థానిక రైల్వే స్టేషన్ ఆవరణలోని మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో శనివారం డోర్నకల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన యూత్ కమిటీ సమావేశంలో ఉద్యోగులతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యల గురించి చర్చించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ఎజెండాగా మజ్దూర్ యూనియన్ పని చేస్తుందన్నారు. అనంతరం బ్రాంచి యూత్ కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో డోర్నకల్ బ్రాంచ్ సెక్రటరీ అంజియాదవ్, చైర్మన్ చరణ్‌నాయక్, వరంగల్, కాజీపేట బ్రాంచుల సెక్రటరీలు ఆవుల యుగేందర్, రాజేందర్, నాయకులు కిషోర్, భాస్కర్‌రావు, కరణ్‌సింగ్, నాగేషు, రమేష్‌బాబు, శోభన్‌ప్రసాద్, వంశీ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర కార్యదర్శిగా సత్యనారాయణ



మహబూబాబాద్ రూరల్: ఐఎస్‌ఓ గుర్తింపు పొందిన అంతర్జాతీయ సాహితీ సాంస్కృతిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర కార్యదర్శిగా జిల్లా కేంద్రానికి చెందిన కవి, రచయిత గుర్రపు సత్యనారాయణ నియామకమయ్యారు. ఈమేరకు సంస్థ సీఈఓ కత్తిమండ ప్రతాప్ శనివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఈనెల 10, 11 తేదీల్లో ఏలూరులో అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రపంచ తెలుగు సాహితీ సంబురాలు..సాహితీ పట్టాభిషేక మహోత్సవాలు జరుగనున్నాయని పేర్కొన్నారు.

ఆరోగ్య కార్యకర్తలు నిబద్ధతతో పనిచేయాలి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవిరాథోడ్




నెహ్రూసెంటర్: వేసవికాలం, రానున్న వర్షాకాలంలో హెల్త్ అసిస్టెంట్లు, ఆరోగ్య కార్యకర్తలు నిబద్ధతతో సమర్థవంతంగా పనిచేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవిరాథోడ్ సూచించారు. జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో హెల్త్ అసిస్టెంట్ల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ వేసవిలో వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గర్భిణుల్లో రక్తహీతనను గుర్తించి ఐరన్ ట్యాబ్లెట్లు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో జీజీహెచ్ గైనకాలజిస్ట్ డాక్టర్ స్రవంతి, గూడూరు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ వీరన్న, ప్రోగ్రాం అధికారి డాక్టర్ సారంగం, సుధీర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, నాగేశ్వర్‌రావు, మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో ప్రసవాల సంఖ్య పెంచాలి

నెల్లికుదురు: ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ రవిరాథోడ్ వైద్యులకు సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో వైద్యాధికారులు, సిబ్బంది శుక్రవారం సమన్వయంతో ఓ మహిళకు నార్మల్ డెలివరీ చేశారు. దీంతో శనివారం పీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌ఓ ఆరోగ్యంగా ఉన్న తల్లి పాపను పరిశీలించారు. అనంతరం వైద్యాధికారులతో సమావేశమై పలు సూచనలు సలహాలు అందించారు. వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటించి పేదలకు వైద్యం అందించాలన్నారు. ఎండకాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.6 కోట్లకు ఐపీ దాఖలు



ఖమ్మం లీగల్: జిల్లా కేంద్రానికి చెందిన మషెట్టి నాగేశ్వరరావు రూ.6,37,21,858కు గాను దివాలా పిటిషన్ (ఐపీ) దాఖలు చేశాడు. మహబూబాబాద్‌తో పాటు ఖమ్మం జిల్లా పరిధిలో ధాన్యం వ్యాపారం చేసిన ఆయన పలువురి వద్ద అప్పులు తీసుకున్నాడు. ప్రస్తుతం తనకు వ్యాపారంలో నష్టం వచ్చి అప్పులు తీర్చలేని పరిస్థితి ఎదురైందంటూ న్యాయవాది ఎం.జె.ప్రవీణ్ కుమార్ ద్వారా ఖమ్మం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం దివాలా పిటిషన్ దాఖలు చేశాడు. కాగా, పిటిషన్‌లో 30 మందిని ప్రతివాదులుగా చేర్చాడు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వేదికపై మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ధనసరి సీతక్క, విప్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్యే శ్రీహరి, హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, అధికారులు

ఆరున్నర గంటలు.. కీలక అంశాలు

ఓరుగల్లులో మంత్రులు ఉత్తమ్, శ్రీనివాస్‌రెడ్డిల పర్యటన

- దేవాదుల పంపుహౌస్, రిజర్వాయర్‌లపై రివ్యూ...
- భద్రకాళి పూడికతీత, సుందరీకరణ పనులపై సీరియస్
- హనుమకొండ కలెక్టరేట్‌లో ఉమ్మడి వరంగల్ అధికారులతో భేటీ
- పెండింగ్ ప్రాజెక్టులు, ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్ష


రాష్ట్ర మంత్రులు నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలు శనివారం హనుమకొండ జిల్లాలో సుడిగాలి పర్యటన చేశారు. మధ్యాహ్నం 1 గంటనుంచి సాయంత్రం 6.30 గంటల వరకు పర్యటన కొనసాగింది. హసన్‌పర్తి మండలం దేవన్నపేటలో దేవాదుల పంప్‌హౌస్, ధర్మసాగర్ రిజర్వాయర్, భద్రకాళి చెరువును సందర్శించారు. చివరగా హనుమకొండ కలెక్టరేట్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించి సాగునీటిపారుదల, పౌర సరఫరాల శాఖలపై అధికారులతో మంత్రులు సమీక్ష సమావేశం నిర్వహించారు.

- సాక్షిప్రతినిధి, వరంగల్

- IIలో▸

రూ.15.98 కోట్లు

- ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా వచ్చిన ఆదాయం
- ముగిసిన దరఖాస్తు గడువు



మహబూబాబాద్: లే అవుట్ లేని ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా అవకాశం కల్పించింది. ఎల్‌ఆర్‌ఎస్ గడువు ఈనెల 3వ తేదీతో ముగిసింది. మొత్తం 27,692 దరఖాస్తులకు 6,627 మంది సద్వినియోగం చేసుకున్నారు. ఆదాయం పరంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎల్‌ఆర్‌ఎస్ రిజిస్ట్రేషన్ల ద్వారా వచ్చిన ఆదాయంతో కలిపితే ఐదు మున్సిపాలిటీలకు గాను రూ.15.98 కోట్ల ఆదాయం వచ్చింది.

ఐదు మున్సిపాలిటీల్లో..

జిల్లాలో మానుకోట, తొర్రూరు, డోర్నకల్, మరిపెడ మున్సిపాలిటీలు ఉండగా ఇటీవల కేసముద్రం కూడా మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయింది. గ్రామాల్లో కూడా ఎల్‌ఆర్‌ఎస్‌కు అవకాశం ఇవ్వగా కేసముద్రం మున్సిపాలిటీలో విలీన గ్రామాల్లో ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు అన్ని మున్సిపాలిటీ లాగిన్‌లో అప్‌లోడ్ చేశారు. 25 శాతం రాయితీతో 2025 మార్చి నెల మొత్తం అవకాశం కల్పించినా పెద్దగా స్పందన లేకపోవడంతో ఏప్రిల్, మే 3వ తేదీ వరకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. గతంలో రూ.1,000 చెల్లించి దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే ప్రభుత్వం మున్సిపాలిటీలో ఎల్‌ఆర్‌ఎస్‌కు అవకాశం ఇచ్చింది. 25 శాతం రాయితీ ఇచ్చిన తర్వాత రూ.1,000 చెల్లించకపోయినా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎల్‌ఆర్‌ఎస్ రిజిస్ట్రేషన్‌కు అవకాశం ఇచ్చిన విషయం విధితమే.

మానుకోటనే టాప్

ఎల్‌ఆర్‌ఎస్ పరంగా కేసముద్రం మున్సిపాలిటీ ద్వారా రూ.54 లక్షల ఆదాయం, తొర్రూరులో రూ.3.56 కోట్లు, డోర్నకల్‌లో రూ.54లక్షలు, మరిపెడలో రూ.1.08లక్షలు, మానుకోటలో రూ.10.16 కోట్ల ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు. ఆదాయం పరంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎల్‌ఆర్‌ఎస్ రిజిస్ట్రేషన్ల ద్వారా వచ్చిన ఆదాయంతో కలిపితే ఐదు మున్సిపాలిటీలకు గాను రూ.15.98 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు.

మున్సిపాలిటీల వారీగా దరఖాస్తుల వివరాలు

మున్సిపాలిటీలు	దరఖాస్తులు చెల్లించినవి	ఫీజు ఇచ్చినవి	ప్రొసీడింగ్
కేసముద్రం	1,538	245	61
తొర్రూర్	10,347	1,850	884
డోర్నకల్	875	240	193
మరిపెడ	2,629	457	139
మానుకోట	12,203	3,835	563
మొత్తం	27,692	6,627	1,840

గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యం

- మంత్రి సీతక్క
- బత్తులపల్లిలో సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన



కొత్తగూడ: మాట్లాడుతున్న మంత్రి సీతక్క

కొత్తగూడ: గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. మండలంలోని బత్తులపల్లిలో రూ.2 కోట్ల నిధులతో నిర్మిస్తున్న 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కొత్తగూడ, గంగారం మండలాలు వైల్డ్ లైఫ్ సాంచురీలో ఉన్నా వెనుకబడిన గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక అనుమతులు ఇచ్చిందన్నారు. బీజేపి ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం చేసిన కులగణననే కాపీ కొట్టిందన్నారు. అంతకుముందు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ప్రేమేష్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్ కో సీఈ చౌహాన్, ఎస్ఈ నరేష్, డీఈలు విజయ్, సునీత, ఈడీఈలు కవిత, అయిలయ్య, ప్రణయ్, నాయకులు వజ్జ సారయ్య, చల్ల నారాయణరెడ్డి, ఇర్ప రాజేశ్వర్, మొగిళి, రూప్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రంలో మూతపడిన ప్రభుత్వ ఎస్సీ హాస్టల్‌ను గురుకుల పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలని నేతకాని కుల సంఘం నాయకులు మంత్రికి వినతిపత్రం సమర్పించారు.

గంగారంలో..

గంగారం: గంగారం మండలంలోని కోమట్లగూడెం గ్రామంలో విద్యుత్ ఉపకేంద్రం 33/11కేవీ పనులకు మంత్రి సీతక్క శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మండలంలోని పోడు భూములకు పట్టాలు పొందిన రైతులకు విద్యుత్ సౌకర్యం కల్పించామన్నారు. గిరిజన ప్రాంతంలో లోఓల్టేజ్ సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

ప్రజల స్నేహితులుగా పోలీసులు

- ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్



మహబూబాబాద్ రూరల్: పోలీసులంటే ప్రజల స్నేహితులుగా ఉండేవిధంగా వ్యవహరించడమే తమ లక్ష్యమని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖ అనేది ప్రజలకు సేవ చేయడానికి ఉండే సంస్థ అని, ప్రతీ పౌరుడు తమ సమస్యలు, అభ్యర్థనలు, ఫిర్యాదులు నేరుగా పోలీసు అధికారులకు తెలియజేసే హక్కు కలిగి ఉన్నారన్నారు. ఇందులో ఎటువంటి మధ్యవర్తులు, సిఫార్సుదారులు, ఇతర ప్రభావాలు అవసరంలేదన్నారు. ప్రజలు తమ సమస్యలను స్వయంగా చెప్పగలిగితే త్వరగా పరిష్కారమయ్యే అవకాశం ఉందన్నారు. అలాగే మన పరిసరాలు మన బాధ్యతలో భాగంగా జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో రాలిన ఆకులు, చెత్తచెదారం, పనికిరాని పేపర్లు, పరిసరాలను శుభ్రపరిచారు.

14నుంచి కేయూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

- ఈనెల 6వరకు పరీక్ష ఫీజు గడువు
- పరీక్ష ఫీజులు చెల్లించినకాలేజీలకే పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, అదిలాబాద్ జిల్లాలో డిగ్రీ బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ, బీ ఒకేషనల్, బీసీఏ తదితర కోర్సుల 2, 4, 6 సెమిస్టర్ల పరీక్షలు, బ్యాక్ లాగ్స్ మొదటి, మూడో, ఐదో సెమిస్టర్ల పరీక్షలు ఈనెల 14నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య రాజేందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్కువశాతం ప్రైవేట్ కాలేజీలు విద్యార్థులనుంచి ఫీజులు వసూలు చేసినప్పటికీ ప్రభుత్వం తమకు ఫీజురీయంబర్స్‌మెంట్ విడుదల చేయలేదనే నెపంతో పరీక్షల నిర్వహణకు సహకరించకపోవడంతో ఇప్పటికే రెండుసార్లు ఈపరీక్షలకు టైంటేబుల్ వెల్ల డించాక వాయిదా వేసినట్లు తెలిపారు. దీంతో డిగ్రీ కోర్సుల ఫైనల్ ఇయర్ విద్యార్థులు నష్టపోయే పరిస్థితి నెలకొని ఉంది. ఈనేపథ్యంలో ప్రస్తుతం పరీక్షలను ఈనెల 14వ తేదీ నుంచి నిర్వహించేందుకు మూడోసారి షెడ్యూల్ ప్రకటించినట్లు తెలిపారు. అయితే విద్యార్థులకు సంబంధించిన ఫీజులు చెల్లించిన కాలేజీలకే పరీక్షలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. అంతేగాకుండా ఈనెల 6వ తేదీ వరకు ఫీజు చెల్లించేందుకు కాలేజీలకు గడువు విధించినట్లు పేర్కొన్నారు. ఆయా కాలేజీలు ఇప్పటికైనా ఫీజు చెల్లిస్తాయా..? లేదా అనేది వేచిచూడాలి. అయితే ఈనెల 8వ తేదీ తర్వాత ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేస్తుందని ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు ఆశాభావంతో ఉన్నట్లు తెలుస్తుంది.

దోస్త్ రిజిస్ట్రేషన్ షురూ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌నాయక్, అధ్యాపకులు

మహబూబాబాద్ అర్బన్: డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్ కోసం దోస్త్ 2025 ఫేజ్ 1 అడ్మిషన్లకు రిజిస్ట్రేషన్ ప్రారంభమైనట్లు నూకల రామచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.లక్ష్మణ్ నాయక్ తెలిపారు. శనివారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దోస్త్ రిజిస్ట్రేషన్ కరపత్రాలను అధ్యాపకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఫేజ్ 1 అడ్మిషన్ ప్రక్రియ మే 3 నుంచి 21 వరకు కొనసాగుతుందని, విద్యార్థులు రూ.200 చెల్లించి దోస్త్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మే 10 నుంచి 22 వరకు వెబ్ ఆప్షన్స్ పెట్టుకోవచ్చని, మొదటి విడత సీట్ అలాట్‌మెంట్ మే 29న జరుగుతుందని, సీట్ పొందిన విద్యార్థులు మే 30 నుంచి జూన్ 6 వరకు దోస్త్ పోర్టల్లో సీట్ నిర్ధారించుకోవాలన్నారు. ఫేస్ 2 రిజిస్ట్రేషన్ ప్రక్రియ మే 30న మొదలవుతుందన్నారు. సలహాలు సూచనలకు దోస్త్ కోఆర్డినేటర్ వి. సాంబశివరావు (9440343941), రామన్న (9908883319) సంప్రదించవచ్చన్నారు.

కర్రిగుట్టల్లో కొనసాగుతున్న కూంబింగ్

వెంకటాపురం(కె): తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని కర్రిగుట్టల్లో సాయుధ బలగాలు 12 రోజులుగా కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. గుట్టల్లో మావోయిస్ట్ అగ్రనేతలతో పాటు సుమారు వెయ్యిమంది మావోయిస్టులు ఉన్నారనే నిఘా వర్గాల సమాచారంతో కర్రిగుట్టలను కేంద్ర బలగాలు చుట్టు ముట్టాయి. ఆ గుట్టల చుట్టూ మావోయిస్టులు అమర్చిన మందు పాతరలను తొలగించుకుంటూ బలగాలు ముందుకు సాగుతున్నాయి. కాగా 12వ రోజు శనివారం కూంబింగ్ ఆపరేషన్‌లో పాల్గొన్న ఇద్దరు జవాన్లు వడదెబ్బకు గురికావటంతో వారిని వెంకటాపురం వైద్యశాలకు తరలించి చికిత్స నిర్వహించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ములుగు ఏరియా వైద్యశాలకు తరలించినట్లు సమాచారం.

అమ్మవారికి సూర్యప్రభ, హంసవాహన సేవలు



సూర్యప్రభ వాహన సేవపై అమ్మవారు

హన్మకొండ కల్చరల్: వరంగల్ శ్రీభద్రకాళిభద్రేశ్వరుల కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు శనివారం ఆలయంలో అర్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో ఉదయం 5గంటల నుంచి నిత్యాహ్నికం, చతుస్థానార్చన నిర్వహించారు. అమ్మవారి ఉత్సవమూర్తిని ఉదయం సూర్యప్రభవాహనంపై, సాయంత్రం హంసవాహనంపై ఊరేగించారు. పూజా కార్యక్రమాలకు వరంగల్ జిల్లా సగర(ఉప్పర) సంక్షేమ సంఘం ఉభయదాతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో సీత కమలాకర్‌రావు, గుజ్జారి అరుణ్‌కుమార్, వడ్లకొండ కుమారస్వామి, కొల్లూరి మధుకర్, సీత దుర్గాప్రసాద్, నలుబోలు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

డిస్నీల్యాండ్‌తో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్



విద్యార్థులను అభినందిస్తున్న డిస్నీల్యాండ్ పాఠశాల యాజమాన్యం

దామెర: విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు డిస్నీ ల్యాండ్ పాఠశాల బాటలు వేస్తున్నట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది. హనుమకొండ జిల్లా దామెర మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలోని డిస్నీల్యాండ్ పాఠశాలకు చెందిన విద్యార్థులు పదోతరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చారు. కాగా పాఠశాల యాజమాన్యం విద్యార్థులను శనివారం అభినందించింది. పాఠశాలకు చెందిన తుత్తురు హర్షిణి, బానోతు శ్రీమాన్ 569 మార్కులు సాధించారు మద్దూరి శ్రీకాంత్ 560 మార్కులు, 47 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించినట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ముఖ్యసలహాదారులు దయ్యాల మల్లయ్య, సదయ్య, బాలుగు లక్ష్మీ నివాసం, డైరెక్టర్లు శోభారాణి, రాకేశ్‌భాను, దినేష్‌చందర్ ఉన్నారు.

9 ప్యాసింజర్ రైళ్లు రద్దు

● మే 3 నుంచి 5వ తేదీ వరకు..

కాజీపేట రూరల్: కాజీపేట నుంచి వెళ్లే పలు ప్యాసింజర్ రైళ్లను శనివారం నుంచి రద్దు చేసినట్లు రైల్వే అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రైన్స్ లోకోపైలెట్లు, అసిస్టెంట్ లోకో పైలెట్లు, గార్డుల డిపార్ట్‌మెంట్ ఎగ్జామ్స్ ఉన్నందున సిబ్బంది కొరత వల్ల పలు రూట్‌లో పలు ప్యాసింజర్ రైళ్లను రద్దు చేసినట్లు అధికారులు రైల్వే అధికారులు తెలిపారు. ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు బల్లార్షా- కాజీపేట (17036) వెళ్లే సింగరేణి ప్యాసింజర్, కాజీపేట-సిర్పూర్ కాగజ్‌నగర్ (17003) వెళ్లే ప్యాసింజర్, బల్లార్షా-కాజీపేట (17004) వెళ్లే ప్యాసింజర్, సికింద్రాబాద్-వరంగల్ (67761) వెళ్లే పుష్‌పుల్, వరంగల్-సికింద్రాబాద్ (67762) వెళ్లే పుష్‌పుల్, సికింద్రాబాద్-కాజీపేట (67763) వెళ్లే పుష్‌పుల్, కాజీపేట-సికింద్రాబాద్ (67764) వెళ్లే పుష్‌పుల్, కాజీపేట-డోర్నకల్ (67765) వెళ్లే పుష్‌పుల్, డోర్నకల్-కాజీపేట (67766) వెళ్లే పుష్‌పుల్ ప్యాసింజర్ రైళ్లను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు వెల్లడించారు.

నేడు నీట్

ఉమ్మడి జిల్లాలో 16 పరీక్ష కేంద్రాల ఏర్పాటు

- హాజరుకానున్న 6,118 మంది విద్యార్థులు
- పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- విద్యార్థులు నిబంధనలు పాటించాలని అధికారులు సూచన

విద్యారణ్యపురి/జనగామ /మహబూబాబాద్ అర్బన్/భూపాలపల్లి అర్బన్: దేశ వ్యాప్తంగా వైద్య విద్యాకోర్సుల్లో ప్రవేశాలకు జాతీయ స్థాయి అర్హత ప్రవేశ పరీక్ష నీట్-యూజీ -25ను ఈనెల 4(ఆదివారం)న నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తంగా 16 పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేయగా.. 6,118 మంది విద్యార్థులు పరీక్షలు హాజరు కానున్నారు. పరీక్ష నిర్వహణకు ప్రతి పరీక్షా కేంద్రానికి ఒక డ్యూటీ మెజిస్ట్రేట్, ప్రతి ఐదు కేంద్రాలకు ఒక నోడల్ అధికారులను నియమించారు. ఆదివారం మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు. ప్రతి పరీక్షా కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్‌తోపాటు డిప్యూ టీసీఎస్‌లు, అబ్జర్వర్లు ఉంటారు.

క్షుణ్ణంగా తనిఖీ చేశాకే అనుమతి..

విద్యార్థులను గేటు వద్ద క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాత ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1-30గంటల వరకు పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారు. నిర్దేశించిన సమయం దాటిన తర్వాత అనుమతించరు. మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు.

పరీక్ష కేంద్రాలు, విద్యార్థులు ఇలా..

జిల్లా	కేంద్రాలు	విద్యార్థులు
హనుమకొండ,వరంగల్	11	4,680
జనగామ	2	580
మహబూబాబాద్	01	513
జే.ఎస్ భూపాలపల్లి	02	345
మొత్తం	16	6,118



భూపాలపల్లిలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే

ప్రతి పరీక్షకేంద్రం వద్ద పోలీస్ బందోబస్త్‌తోపాటు 144 సెక్షన్‌ను అమలుచేస్తారు. పరీక్షాకేంద్రాల సమీపంలో జిరాక్స్ సెంటర్లను మూసివేస్తారు. పరీక్షాకేంద్రాల్లోనికి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు సెల్‌ఫోన్‌లు, డిజిటల్ చేతిగడియారాలు, బ్లూటూత్, అనుమంతించరు. విద్యార్థినులు అభరణాలు ధరించకూడదు. పెన్నులు, పెన్సిళ్లు తీసుకు రావొద్దు. విద్యార్థులు అడ్మిట్‌కార్డుతోపాటు పాస్‌ఫోర్టు సైజ్‌ఫొటో, ఆధార్ కార్డు, లేటెస్టు పాస్‌ఫొటోతోకూడిన ఐడీప్రూఫ్ తీసుకొని రావాల్సి ఉంటుంది. దివ్యాంగులైతే సంబంధిత సర్టిఫికెట్లను తీసుకువావాల్సి ఉంటుంది. సీసీ కెమెరాల నిఘాలో పరీక్ష నిర్వహించనున్నారు. ప్రతి పరీక్షాకేంద్రంలో మెడికల్ క్యాంపు ఏర్పాటుచేశారు. పరీక్షల సమయంలో నిరంతరంగా విద్యుత్ ఉండేలా చర్యలకు కలెక్టర్లు సంబంధిత అధికారులకు ఆదేశించారు.

ఉమ్మడిజిల్లాలో నీట్ పరీక్ష కేంద్రాలు ఇవే..

- నేషనల్ ఇన్సిటిట్యూట్ ఆఫ్‌టెక్నాలజీ వరంగల్, సెంటర్- 1
- నేషనల్ ఇన్సిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వరంగల్ సెంటర్- 2
- హనమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్‌కాలేజీ
- హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కాలేజీ (కో ఎడ్యూకేషన్)
- హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీకాలేజీ(అటానమస్)
- హనుమకొండలోని సుబేదారిలోని యూనివర్సిటీ పీజీ కాలేజీ
- పీఎం శ్రీ కేంద్రియ విద్యాలయ, వరంగల్
- హనుమకొండలోని వడ్డెపెల్లిలోనిన ప్రభుత్వ పింగిళి మహిళా కాలేజీ (అటానమస్)
- జవహర్ నవోదయ విద్యాలయం మామునూర్
- హనుమకొండలోని పీఎంశ్రీ ప్రభుత్వ ప్రాక్టిసింగ్ హైస్కూల్
- హనుమకొండలోని వడ్డెపెల్లిలోని ప్రభుత్వపింగిళి బాలికల జూనియర్ కళాశాల
- మహబూబాబాద్‌లోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ గురుకుల జూనియర్ కళాశాల
- జనగామ ప్రభుత్వ ఏబీవీ డిగ్రీ కళాశాల
- పెంబర్తి ఎంజేపీ గురుకులం
- భూపాలపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాల

విద్యార్థులు పరీక్ష సమయంలో చేయాల్సినవి..

- టెస్ట్ బుక్‌లెట్ లో 180 ప్రశ్నలు ఉంటాయి. ప్రతి ప్రశ్నకు 4 మార్కుల తోపాటు తప్పుగా ఉంటే మార్క్ చేయబడ్డ ఆప్షన్‌కు మైనస్ వన్(-1) మార్క్ ఉంటుంది.
- టెస్ట్ బుక్ లెట్ కోడ్ చెక్ చేసుకోవాలి.
- ఓఎంఆర్ ఆన్సర్ షీట్ టెస్ట్ బుక్ లెట్‌లో ఉన్న విధంగానే ఉంటుంది.
- టెస్ట్ బుక్‌లెట్‌పై రూల్ నంబర్ రాయడం మర్చిపోవద్దు.
- ఓఎంఆర్ ఆన్సర్ షీట్ టెస్ట్ బుక్ లెట్‌కు అనుసంధానం చేసి ఉంటుంది.
- బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్ మాత్రమే ఉపయోగించాలి.
- టెస్ట్ బుక్‌లెట్, ఓఎంఆర్ ఆన్సర్ షీట్‌లోని అన్ని పేజీలను సరిగ్గా ముద్రించారా లేదా సరిచూసుకోవాలి.
- సరైన టెస్ట్ బుక్‌లెట్‌ను పొందారా లేదా చూసుకోవాలి. పరీక్ష ప్రారంభమైన ఐదు నిమిషాల తర్వాత తప్పుగా ఉంటే మార్పులు ఉండవు.
- ఓఎంఆర్ ఆన్సర్ షీట్ ఖాళీగా ఉంచరాదు. ఒకవేళ ఏదైనా ఓఎంఆర్ ఆన్సర్ షీట్ ఖాళీగా ఉన్నట్లు గుర్తిస్తే, ఇన్విజిలేటర్ తన సంతకంతో క్రాస్ చేయాలి. అలాగే క్యాన్సిల్ చేయబడింది అని రాయాలి.
- విద్యార్థులు ఓఎంఆర్ ఆన్సర్ షీట్‌లో పేరు, రూల్ నంబర్, టెస్ట్ బుక్ లెట్ నంబర్, కోడ్, తల్లి పేరు, తండ్రి పేరు మొదలైన పూర్తి వివరాలను రాయాలి.
- ఓఎంఆర్ ఆన్సర్ షీట్‌లో అభ్యర్థి, ఇన్విజిలేటర్ ఇద్దరి సంతకం తప్పనిసరి. రెండు సంతకాలు లేని ఓఎంఆర్ ఆన్సర్ షీట్‌ను పరిగణలోకి తీసుకోరు.
- పరీక్ష సమయంలో ఓఎంఆర్ ఆన్సర్ షీట్ పై స్క్రాచ్ లేదా డ్యామేజ్ చేసేందుకు ఎరేజర్, నెయిల్, బ్లేడ్, వైట్ ఫ్లూయిడ్ లేదా వైట్నర్ ఉపయోగించొద్దు. డ్యామేజ్ చేస్తే విద్యార్థుల అభ్యర్థిత్వంతోపాటు ఓఎంఆర్ ఆన్సర్ షీట్ రద్దు చేస్తారు.
- పరీక్ష ముగిసిన తర్వాత అభ్యర్థి టెస్ట్ బుక్ లెట్ తీసుకెళ్లవచ్చు.
- అభ్యర్థి ఓఎంఆర్ ఆన్సర్ షీట్(ఒరిజినల్, ఆఫీస్ కాపీ రెండూ) ఇన్విజిలేటర్‌కు ఇవ్వకుంటే అభ్యర్థిత్వాన్ని రద్దు చేయడంతోపాటు క్రిమినల్ చర్యలు తీసుకుంటారు.
- పరీక్ష హాలులో విద్యార్థులు క్రమశిక్షణా రాహిత్యంగా ప్రవర్తిస్తే అభ్యర్థిత్వాన్ని రద్దు చేయడంతోపాటు భవిష్యత్ పరీక్షలకు హాజరుకాకుండా నిరోధించే అవకాశం ఉంటుంది. క్రిమినల్ చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.

చెరువులో పడి దినసరి కూలీ మృతి

- రోడ్డున పడిన కుటుంబం
- అనాథలైన ఇద్దరు కూతుళ్లు



అజీజ్ (ఫైల్)

హసన్‌పర్తి: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వంగపహాడ్ గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. వంగపహాడ్‌కు చెందిన మహ్మద్ అజీజ్ (38) దినసరి కూలీ. స్థానిక బాబోయిన చెరువు వద్దకు శనివారం వెళ్లాడు. ప్రమాదవశాత్తు జారి చెరువులో పడ్డాడు. ఈత రాకపోవడంతో మృతి చెందాడు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

రోడ్డున పడిన కుటుంబం



మృతుడి తల్లి, కూతురు

అజీజ్ మృతితో ఆ కుటుంబం రోడ్డున పడింది. అజీజ్ భార్య కూడా అనారోగ్య సమస్యలతో ఇటీవల మృతి చెందింది. తండ్రి మృతదేహం వద్ద ఇద్దరు కూతుళ్లు బోరున విలపించడంతో అక్కడికి వచ్చిన వారు చలించిపోయారు. అంత్యక్రియలకు కూడా వారి వద్ద చిల్లిగవ్వ కూడా లేదని స్థానికులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

రెండు కుటుంబాల్లో విషాదం

- సిద్దిపేట జిల్లాలోని రంగనాయక సాగర్‌లో నగరవాసుల మృతి



మెహ్రోజ్ మృతదేహం

వరంగల్: రెండు కుటుంబాలకు చెందిన ఓ బాలుడు, బాలిక మృతిచెందడంతో వరంగల్ ఎల్‌బీనగర్ ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వివరాలిలా ఉన్నాయి.. వరంగల్ నుంచి రెండు కుటుంబాలకు చెందిన వారు శనివారం హైదరాబాద్‌కు వెళ్తూ మార్గమధ్యలో సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు సమీపంలోని రంగనాయకసాగర్‌లో ఈత కొట్టేందుకు దిగినట్లు తెలిసింది. మెహ్రోజ్(13), అర్బాజ్(15) చెరువులో కొంతలోతుకు వెళ్లడంతో ప్రమాదవశాత్తు మునిగిపోయి మృతిచెందినట్లు తెలిసింది. మునిగిపోయిన వారిలో మెహ్రోజ్ మృతదేహాన్ని పోలీసులు అగ్నిమాపక సిబ్బంది సాయంతో వెలికితీయగా అర్బాజ్ మృతదేహం కోసం గజఈతగాళ్లతో గాలింపు చేపట్టినట్లు సమాచారం. వివరాల కోసం ఎల్‌బీనగర్‌లోని ఏజాజ్ ఇంటికి వెళ్లగా తాళం వేసి ఉంది. చార్‌బౌళిలో కిరాయి ఉంటున్న ఏజాజ్ రెండు నెలల క్రితమే ఈప్రాంతానికి అద్దెకు వచ్చారని వారి వివరాలు తెలియవని పక్కనే కిరాయికి ఉన్నవారు తెలిపారు. కాగా బాలిక మెహ్రోజ్ తండ్రి యాకుబ్ బాబా బిల్డర్ అని, అర్బాజ్ తండ్రి క్యాబ్, ఆటోడ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నట్లు సమాచారం. ఈ విషయంపై ఇంతేజార్‌గంజ్ పోలీసులను సంప్రదించే ప్రయత్నం చేయగా.. స్పందించలేదు.



ఏజాజ్ అద్దెకు ఉంటున్న ఇల్లు

కేంద్ర ప్రభుత్వానిది కక్ష సాధింపు

- ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- వక్ఫ్‌బోర్డ్ చట్ట సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ర్యాలీ

హన్మకొండ చౌరస్తా: కేంద్ర ప్రభుత్వం ముస్లింలపై కక్ష సాధింపు చర్యలతో లౌకిక రాజ్యాంగానికి వ్యతిరేకంగా మతోన్మాద చర్యలు చేపడుతుందని వరంగల్ ఎంపీ కావ్య అన్నారు. వక్ఫ్ బోర్డ్ చట్ట సవరణ బిల్లుకు వ్యతిరేకంగా రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రూ పాషా ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. వరంగల్‌లోని ఇస్లామియా కాలేజీ మైదానం నుంచి హనుమకొండ రాయపురలోని జక్రియా ఫంక్షన్ హాల్ వరకు సాగిన ర్యాలీలో ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. హిందూస్తాన్ జిందాబాద్ అంటూ నినాదాలు చేస్తూ.. సాగిన ర్యాలీలో ఎంపీ కావ్య పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ వక్ఫ్ చట్టం సవరణ బిల్లును వ్యతిరేకిస్తుందని, లౌకిక స్వభావానికి సవాల్ విసిరే ఇలాంటి చట్టాలను ప్రజాస్వామికవాదులు ఖండించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ అండ్ కాలేజీల చైర్మన్ ఫహీం ఖురేషీ మాట్లాడుతూ.. ఎల్కతుర్తిలో జరిగిన బీఆర్‌ఎస్ రజతోత్సవ సభలో కేసీఆర్ వక్ఫ్ సవరణ బిల్లుపై ఎందుకు మాట్లాడలేదంటూ చేసిన వ్యాఖ్యలపై బీఆర్‌ఎస్ నాయకులు తీవ్రంగా మండిపడ్డారు.

ఆరున్నర గంటలు.. కీలక అంశాలు





సమీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యేలు నాగరాజు, యశస్విని రెడ్డి, సత్యనారాయణరావు, మురళీనాయక్, వివిధ జిల్లాల కలెక్టర్లు, అధికారులు



భద్రకాళి అమ్మవారికి పూజలు చేస్తున్న మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, విప్, ఎమ్మెల్యేలు, తదితరులు

ఓరుగల్లులో మంత్రులు ఉత్తమ్, శ్రీనివాస్‌రెడ్డి పర్యటన

- ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, ఉన్నతాధికారులతో భేటీ
- ప్రాజెక్టులు, ధాన్యం కొనుగోళ్లు, సుందరీకరణ పనులపై దృష్టి
- దేవాదుల పంపుహౌస్, రిజర్వాయర్‌లపై రివ్యూ...
- హనుమకొండ కలెక్టరేట్‌లో ఉమ్మడి వరంగల్ అధికారులతో భేటీ
- పెండింగ్ ప్రాజెక్టులు, ప్రభుత్వ పథకాలపై సమీక్ష



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పక్కన మంత్రి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, తదితరులు

సాక్షిప్రతినిధి, వరంగల్/ధర్మసాగర్: రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాలశాఖల మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి, రెవెన్యూ, గృహనిర్మాణశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలు జిల్లాలో శనివారం సుడిగాలి పర్యటన చేశారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ ద్వారా మధ్యాహ్నం 1 గంటలకు చేరుకుని సాయంత్రం 6.30 గంటల వరకు.. ఆరున్నర గంటల పాటు ఎమ్మెల్యేలు, కలెక్టర్‌లతో కలిసి కీలక ప్రాజెక్టుల పరిశీలన, సమీక్ష చేశారు. మొదట హసన్‌పర్తి మండలం దేవన్నపేటలో దేవాదుల పంప్‌హౌజ్‌కు చేరుకున్న మంత్రులు అక్కడ నీటిపారుదలశాఖ అధికారులతో మాట్లాడి.. ధర్మసాగర్ రిజర్వాయర్‌కు వెళ్లి పెండింగ్ పనులపై ఆరా తీశారు. అనంతరం భద్రకాళి చెరువును సందర్శించి పూడికతీత పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అంతకుముందు భద్రకాళి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. వారికి వేద పండితులు తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు, మహాదాశీర్వచనం అందజేశారు. అక్కడి నుంచి హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌కు కాన్ఫరెన్స్ హాలుకు చేరుకుని ఉమ్మడి వరంగల్ కలెక్టర్‌లు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.

ఉమ్మడి వరంగల్ సమస్యలపై ఏకరువు...

ఉమ్మడి వరంగల్‌లో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులను సమీక్షా సమావేశంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డిల ముందు జిల్లా మంత్రి ధనసరి సీతక్క సహా పలువురు ఎమ్మెల్యేలు కావాల్సిన అభివృద్ధి పనులు, సమస్యలను ఏకరువు పెట్టారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ ములుగు జిల్లాలో అధికంగా ఉన్న గిరిజన గ్రామాల పరిధిలో వాగులు ఉన్నందున చెక్ డ్యామ్‌లను నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. సాగునీటి కాలువల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. డోర్నకల్ ఎమ్మెల్యే, విప్ రామచంద్రనాయక్, స్టేషన్ ఘన్‌పూర్, పాలకుర్తి, వర్ధన్నపేట, భూపాలపల్లి, మహబూబాబాద్ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, యశస్విని రెడ్డి, కె.ఆర్.నాగరాజు, సత్యనారాయణ రావు, మురళీ నాయక్ మాట్లాడారు. తమ నియోజకవర్గాల్లోని సాగునీటి కాలువలు, చెరువులు, వాగులు, సాగునీటి ఇబ్బందులు తీర్చాలని కోరారు.

రెండు సీజన్లలో 280 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం.. ఉమ్మడి రాష్ట్రం రికార్డు బ్రేక్: మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి,

ఉమ్మడి వరంగల్ జిల్లాలో సాగునీటిపారుదల శాఖ అభివద్ధి పనుల పురోగతి, పౌర సరఫరాల శాఖలకు సంబంధించిన అంశాలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించేందుకు జిల్లాకు వచ్చాం. దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేయాలనే దృఢ సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. దేవన్నపేట శివారులోని దేవాదుల పంప్ హౌస్‌ను కూడా సందర్శించాం. దేశంలో ఏ రాష్ట్రంలో పండని వరి పంట తెలంగాణలో వానాకాలం, యాసంగిలో 280 లక్షల మెట్రిక్ టన్నుల పంట పండింది. ఎఫ్‌సీఐకి ధాన్యం విక్రయించే రాష్ట్రాల్లో తెలంగాణ రాష్ట్రం ముందు వరుసలో ఉంది. రాష్ట్రంలో సాగునీటి పారుదల శాఖను బలోపేతం చేస్తున్నాం. ఎమ్మెల్యేలు సూచించిన విధంగా సాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడతాం.

అసంపూర్తి పనులు పూర్తి..నియోజకవర్గాల వారీగా పరిష్కారం: మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

ఇరిగేషన్‌లో అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులు, ఆగివున్న పనులన్నింటిని పూర్తి చేసి పంటకు నీరందించడానికి ప్రభుత్వం కృషి చేస్తుంది. ఎమ్మెల్యేలు చెప్పిన విధంగా నియోజకవర్గాల్లో ఉన్న సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు అధికారులతో సమీక్షించాం. భద్రకాళి చెరువు పునరుద్ధరణ పనులు ప్రభుత్వం చిత్తశుద్ధితో చేస్తుంది. 50% పనులు పూర్తి చేసినందుకు రెండు జిల్లాల కలెక్టర్లు, అధికారులకు అభినందనలు. ఇది అధికారుల పనితీరు చిత్తశుద్ధికి నిదర్శనం. ఈ సమావేశంలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య, బస్వరాజు సారయ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, సిరిసిల్ల రాజయ్య, హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, ములుగు, జనగామ, భూపాలపల్లి జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద, అద్వైత్ కుమార్ సింగ్, దివాకర టీఎస్, రిజ్వాన్ బాషా షేక్, రాహుల్ శర్మ, సాగునీటి పారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

'పల్లా' వర్సెస్ నాయిని, నాగరాజు

మంత్రులు ఉత్తమ్, పొంగులేటిల పర్యటన సందర్భంగా హసన్‌పర్తి మండలం దేవన్నపేట వద్ద ఇరిగేషన్ శాఖ అంతర్గత సమీక్షలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ఎమ్మెల్యేల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అంతర్గత సమావేశంలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి వ్యక్తిగత సిబ్బంది వీడియో చిత్రీకరించడంపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఎమ్మెల్యేల మధ్య మాటమాట పెరిగి ఘర్షణ వాతావరణం చోటు చేసుకోగా.. 'నా వ్యక్తిగత సిబ్బందితో వీడియో తీయించుకుంటే తప్పేంటి' అని పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రశ్నించడంపై ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంలో మంత్రులు మౌనం వహించారు.

ముగిసిన ఉమ్మడి జిల్లా స్థాయి చెస్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్: వరంగల్ జిల్లా చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో వరంగల్‌లోని చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి చదరంగ పోటీలు శనివారం ముగిశాయి. ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిలుగా సీనియర్ సివిల్ జడ్జి క్షేమాదేశ్‌పాండే, రవీందర్ రెడ్డి హాజరై విజేతలకు ట్రోఫీ, పతకాలు, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతిభ గల క్రీడాకారులను గుర్తించేందుకు టోర్నమెంట్లు ఉపయోగపడతాయని అన్నారు. క్రీడాకారులు, క్రీడలను ప్రోత్సహించేందుకు తామెప్పుడు ముందుంటామని చెప్పారు. టోర్నమెంట్ నిర్వహణ కార్యదర్శి పి.కన్నా మాట్లాడుతూ.. అండర్-9, 11 బాలబాలికల విభాగంలో జరిగిన పోటీల్లో ఉమ్మడి జిల్లా నుంచి 35 మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. ఇందులో అండర్-9 బాలుర కేటగిరీలో శ్రేయస్‌రామ్, అక్షత్ చౌహాన్, వేదాన్ష్ విశ్వంభర, ప్రత్యుమ్నరెడ్డి మొదటి నాలుగు స్థానాల్లో నిలిచారని తెలిపారు. బాలికల విభాగంలో జాన్వీ, సాన్విక, ఏ.ఆద్య, టీ.ఆద్య, అండర్-11 బాలుర విభాగంలో సాయి జోషిత్, డి.జితేష్, వర్షిత్‌కుమార్, హిమాన్షు, బాలికల విభాగంలో హరిప్రియ, నిహారిక, సహస్ర, నిత్య విజేతలుగా నిలిచారని తెలిపారు. చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యదర్శి మాడూరి వేదప్రకాశ్, ట్రెజరర్ అల్లె సంపత్, ఆర్బిటర్ ప్రేమ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

'నాలుగు పదుల వయసు దాటిన మహిళల్లో హార్మోన్లలో మార్పులు సహజం. అందుకే పోషకాహారాన్ని ప్లాన్ చేసుకోవడమే కాదు ఆరోగ్యానికి కొన్ని సప్లిమెంట్స్ వాడకం కూడా అవసరమే' అంటూ తన డైట్‌ప్లాన్‌ను వివరించారు బుల్లితెర నటి, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ అస్మిత కర్ణని. 'ఇరవై ఏళ్లుగా హెల్తీ డైట్ ప్లాన్ చేసుకున్నందుకే ఈ రోజుకీ హెల్తీగా ఉన్నాను' అని చెబుతున్నారు.

ఫైబర్ ముందు... ప్రొటీన్లు తర్వాత


అస్మిత కర్ణని

'మైండ్ ప్రశాంతంగా ఉండాలంటే బాడీ కూల్‌గా ఉండాలి. నా శరీరానికి ఎలాంటి పోషకాలు అవసరమో తెలుసుకుంటూ, 20 ఏళ్లుగా డైట్ ప్లాన్ చేస్తున్నాను. రోజూ ఉదయం నట్స్, డ్రై ఫ్రూట్స్‌తో రోజును స్టార్ట్ చేస్తాను. వర్కౌట్స్ తర్వాత సలాడ్స్, ఫుడ్ సంప్లిమెంట్స్ తీసుకుంటాను. ఒక పూట భోజనానికే ప్రాముఖ్యత. 40 ఏళ్ల తర్వాత హార్మోన్లలో చాలా వేగంగా మార్పులు వస్తుంటాయి. మన ఆరోగ్యం హార్మోన్ల మీదనే ఆధారపడి ఉంటుంది. ఈ రోజుల్లో ఆహారపదార్థాల్లో పోషకాలు బాగా తగ్గిపోయాయి. అందుకే నిపుణులు సూచించిన మెడికల్ న్యూట్రిషన్ సప్లిమెంట్స్ తీసుకుంటాను.

బయటి ఫుడ్ తీసుకోను...

లంచ్ టైమ్‌లో ఒక వరస క్రమాన్ని పాటిస్తాను. మొదట కడుపులోకి వెళ్లాల్సింది పీచుపదార్థాలు. అందుకని కూరగాయలతో చేసిన సలాడ్ ముందుగా తీసుకుంటాను. తర్వాత ప్రొటీన్ డైట్, ఆ తర్వాత కార్బోహైడ్రేట్స్ ఉన్న డైట్ తీసుకుంటాను. బయటి ఫుడ్ దాదాపు తీసుకోను.

ఉప్పు... చక్కెర తక్కువ

మన శక్తి స్థాయిలు పెరగాలంటే ఉప్పు, పంచదార వాడకం బాగా తగ్గించేయాలి. అలా చేయడం వల్ల ఎనర్జీ ఏ మాత్రం తగ్గదు. సీజనల్ ఫ్రూట్స్‌ని ఎప్పుడూ వదులుకోను. వీటిని అరగంటసేపు నీటిలో నానబెట్టి, తీసుకుంటే రసాయనాల ప్రభావం తగ్గుతుంది. డ్రై ఫ్రూట్స్ సాయంత్రం 4:30 కి తీసుకుంటాను. తర్వాత బ్లాక్ కాఫీ. కాఫీ లేదా టీ పాలతో తీసుకుంటే బరువు పెరుగుతారు. అందుకని బ్లాక్ కాఫీ తీసుకుంటాను. సాయంకాలం ప్రొటీన్లు ఉండే ఆహారం తీసుకుంటాను. దీని వల్ల బరువు 70 కేజీలు ఉన్నా, సన్నగా కనిపిస్తాను. ప్రొటీన్ పౌడర్‌కి, యోగర్ట్, కొన్ని ఫ్రూట్స్ కూడా కలిపి తీసుకుంటాను. సూర్యాస్తమయం తర్వాత ఏదీ తినను. ఏడాది మొత్తం నా డైట్ చార్ట్ ఇలాగే ఉంటుంది.

కండరాల బలానికి...

వేసవిలో డీ హైడ్రేట్ అవకుండా ఉండటానికి చాలా జాగ్రత్తలు తీసుకుంటాను. ఎప్పుడైనా లో ఎనర్జీ అనిపిస్తే ఎలక్ట్రాల్ పౌడర్ కలిపిన చల్లని నీళ్లు తీసుకుంటాను. రోజులో 3-4 లీటర్ల నీళ్లు తాగుతాను. జనరల్ ఫిట్‌నెస్ కోసం వారంలో 2-3 సార్లు వర్కౌట్స్ చేస్తాను. దీనివల్ల బరువు కూడా మెయింటెన్ అవుతుంది. వృద్ధాప్యంలో కండరాల బలం కోల్పోకుండా ఉండాలంటే ఇప్పటి నుంచే వాటికి పని పెట్టాలి. అందుకని వ్యాయామం తప్పనిసరి. అందం గురించి కాదు. ఆరోగ్యంగా ఉండాలనుకోవడం జీవితాంతం చేసే ప్రయాణం. అందుకు నా జీవన శైలిని కూడా ఫిక్స్ చేసుకున్నాను'' అని వివరించారు అస్మిత.

నిర్వహణ:
నిర్మలారెడ్డి





బరువును తగ్గించే సీజన్

వేసవిలో పెరిగే ఉష్ణోగ్రతలు శరీరంలోని నీటిని ఆవిరి చేస్తుంటాయి. ఎన్నిసార్లు నీళ్లు తాగినా దాహం తీరదు. ఆకలిగానూ అనిపించదు. అలసట, నీరసంతో రోజంతా చికాకు. ఈ సమస్యలకు పరిష్కారం మన చేతిలోనే ఉందంటున్నారు పోషకాహార నిపుణులు సుజాతా స్టీఫెన్.

'శరీరం త్వరగా డీ-హైడ్రేట్ అయ్యే కాలం ఇది. తినే పదార్థాల ఎంపిక సరిగా లేకపోతే జీర్ణవ్యవస్థ గాడి తప్పుతుంది. ఇలాంటప్పుడు...

- కూరగాయలతో చేసిన సలాడ్స్, సాంబార్, రసం.. వంటివి రెగ్యులర్ డైట్‌లో చేర్చుకోవాలి.
- రెండు గంటలకు ఒకసారి గ్లాసుడు నీళ్లు, వేడి ఎక్కువగా ఉన్నప్పుడు అరగంటకు ఒకసారి నీళ్లు తాగాలి.
- అకస్మాత్తుగా తలనొప్పి, భావోద్వేగాలలో మార్పు, నీరసం, ఇరిటేషన్.. వంటివీ తలెత్తుతుంటాయి. దీనిని సైలెంట్ డీ-హైడ్రేషన్ సమస్యగా గుర్తించి నీళ్లు తాగి, కొన్ని నిమిషాలు విశ్రాంతి తీసుకోవాలి.
- నిమ్మరసం, సబ్జా గింజలతో తయారు చేసుకున్న లస్సీ ఒంటికి మేలు చేస్తుంది. నిమ్మరసంలో షుగర్‌కు బదులు కొద్దిగా ఉప్పు, సోడా కలుపుకొని తాగచ్చు.
- మధుమేహులు ఒకేసారి ఎక్కువ మొత్తం తింటే, శరీరంలో గ్లూకోజ్ లెవల్స్ పెరుగుతాయి. అందుకని టైమ్ ప్రకారం ఏదో ఒకటి మితంగా తినాలి.

గర్భిణులకు ప్రత్యేకం

ఈ కాలం గర్భిణులు ఏ కొంచెం తిన్నా ఆయాసం వస్తుంటుంది. ఇలాంటప్పుడు మసాలా ఉన్న ఆహారం కాకుండా పండ్లు, జ్యూసులు, సలాడ్స్ పైన దృష్టి పెట్టాలి. దీని వల్ల కడుపులో హెవీగా ఉన్నట్టు అనిపించదు. ఆయాసం సమస్య తలెత్తదు.

వయసు పైబడిన వాళ్లు

పగటివేళ ఎండగా ఉన్న సమయాల్లో బయటకు వెళ్లకుండా ఉంటేనే మంచిది. తప్పనిసరి అయితే వెంట నీళ్లు, పండ్లు తీసుకెళ్లాలి. డీ హైడ్రేట్ అయితే బీపీ డౌన్ అయ్యి కళ్లు తిరిగి పడిపోయే ప్రమాదం ఉంటుంది. అందుకని వారి వెంట మరొకరు తోడుండాలి.

రీ హైడ్రేషన్

వేసవిలో యూరిన్ పసుపు రంగులో వస్తుందంటే శరీరంలో నీటిశాతం తగ్గిందని అర్థం. రీ హైడ్రేషన్ కోసం నీళ్లు, నిమ్మరసం సరైన ఎంపిక. ఫ్లేవర్డ్, షుగర్ లెస్ మెడికేటెడ్ ఓఆర్‌ఎస్‌లను ఎంచుకోవచ్చు.

ఇది మంచి సీజన్

- బరువు తగ్గాలనుకునేవారికి ఇది మంచి సీజన్. వేడికి ఎక్కువ ఆహారం తినబుద్ధి కాదు.. పండ్లు, కూరగాయలు, జ్యూస్, నీళ్లు ఎక్కువ తీసుకుంటాం. ఇదంతా లో క్యాలరీ ఫుడ్. దీనివల్ల బరువు సులువుగా తగ్గచ్చు.
- వాకింగ్, జాగింగ్, వ్యాయామాలకు ఉదయం వేళ ఎంచుకోవడమే మంచిది.
- వేసవిలో పార్టీలకు వెళ్లినప్పుడు తినే మసాలా ఫుడ్స్ మరుసటి రోజు కూడా ప్రభావం చూపుతుంది. పడుకునేటప్పుడు మజ్జిగ తాగితే అసౌకర్యం తగ్గుతుంది.

కూల్ సలాడ్

- కీరా, దోస, పుదీనా, కొత్తిమీర, ఉల్లిపాయ, క్యాప్సికమ్ వంటివి సన్నని ముక్కలుగా తరిగి, నిమ్మరసం, ఉప్పు, మిరియాలపొడి కలిపి సలాడ్ తయారు చేసుకోవాలి. దీనిని ఫ్రిజ్‌లో పెట్టి, రోజులో రెండు మూడుసార్లు తింటే, తేలికగా అనిపిస్తుంది.
- సొరకాయ జ్యూస్, పుదీనా, కొత్తిమీర షర్బత్‌లు, చట్నీలు, రాగి జావ వంటివి.. ఒంటికి మేలు చేస్తాయి.
- మాంసాహారులు తాజాగా తయారు చేసుకున్నవి, నూనె తక్కువగా ఉపయోగించినవి తీసుకోవాలి.



– సుజాతా స్టీఫెన్,
న్యూట్రిషనిస్ట్

'డాబా', 'మిద్దె', 'మేడ'... ఈ మాటలు పిల్లలకు తెలుసో లేదోగానీ వేసవి వస్తే ఊళ్ల నుంచి వచ్చిన కజిన్స్‌తో డాబా మీద చాపలు పరుచుకుని ఆకాశాన్ని చూస్తూ చల్లటి గాలిలో కబుర్లు చెప్పుకుంటూ నిద్రపోవడం పెద్ద లగ్జరీ. అనుబంధాలకు బేస్‌మెంట్. నగరాల్లో సరే... ఊళ్లల్లో కూడా పిల్లలకు ఈ భాగ్యం ఉండటం లేదు. ఒకప్పటి ఈ దేశీయ ఆనవాయితీ కాలక్రమంలో 'స్లీపోవర్'గా మారింది. కాని సిసలైన స్లీపోవర్స్‌ను ఈ వేసవిలో పెద్దలే కలిగించాలి.



డాబా నిద్రలూ కజిన్స్‌తో కబుర్లూ



చుక్కల ఆకాశం. ఆగి ఆగి రివ్వున వీచే గాలి. సాయంత్రం నీళ్లు చల్లి డాబా నేల మీదున్న ఉడుకంతా కడిగిస్తే రాత్రికి వేడి కాస్త నిమ్మళించి ఉంటుంది. ఇంట్లోని ఎక్కడెక్కడివో చాపలు, బొంతలు, దుప్పట్లు, పరుపులు, దిండ్లు పైకి వస్తాయి. పక్కలు ఏర్పాటవుతాయి. టేబుల్ ఫ్యాన్ ఉంటే అది కూడా తోడు నిద్రపోవడానికి వస్తుంది. చెంబులు, వాటర్ బాటిల్స్‌లో నీళ్లు ఒక పక్కగా సిద్ధమవుతాయి. పెద్దవాళ్లు వాళ్ల పాతకబుర్లు చెప్పుకోవడం మొదలుపెడతారు. పిల్లల కోసం వేసిన వరుసలో పిల్లలు ఊరికూరికే నవ్వుతుంటారు. ఏమిటేమిటో మాట్లాడుతుంటారు. 'ఏరా... నిద్రపోరా?' అని పెద్దలు గదిమితే నిద్రపోతారా? వారికి నిద్రే రాదు. ఎందుకంటే అది వేసవి కాలం. అది డాబా మీద పక్క. తోడు ఉన్నది ఇష్టమైన బంధువులు. అన్నయ్యలు, తమ్ముళ్లు, అక్కలు, చెల్లెళ్లు, కజిన్స్... రాక రాక వచ్చారు. రాత్రిని నిద్రలో వృథా చేయరు పిల్లలు. కబుర్లే కబుర్లు చెప్పుకుంటారు.

పాతకాలం దాటి వచ్చిన పెద్దవారిని వేసవి కాలం గురించి అడిగితే వారు ఇష్టంగా చెప్పుకునే జ్ఞాపకం మేడ మీది నిద్రలే. ఎండవల్ల ఇంట్లో ఉబ్బరింత భరించలేక డాబా మీద, బయటి అరుగుల మీద, పెరట్లో, ఆఖరుకు వీధిలో కూడా మంచాలు వేసుకుని వరుసగా కొలువు తీరి పొద్దు పోయేంత వరకూ వేసే బాతాఖానీ తలుచుకుంటారు. పిల్లలుగా ఉండగా ఏం మాట్లాడుకున్నారో గుర్తు ఉండదుగాని అలా నిద్రపోవడంలోని ఆనందం గుర్తు ఉంటుంది.

పుణ్యక్షేత్రాలలో, జాతరలలో, తిరునాళ్లల్లో గుంపుగా నిద్రపోయినప్పుడు ఉత్సాహం వస్తుంది మనిషికి. పిల్లలకైనా అంతే. గుంపుగా కలిసి ఆరుబయలులో పడుకోవడం హుషారు. బంధువుల పిల్లలు వస్తే 'వీళ్లు మనవారు' అనే భావనతో విపరీతమైన దగ్గరితనం ఏర్పడుతుంది ఆ సమయాన. లోలోపల ఉన్న మొహమాటాలు పోయి ఓపెన్ అవుతారు. స్కూలు, పుస్తకాలు, సినిమాలు, ఆటలు, స్నేహితుల పేచీలు, టీచర్లు... ప్రతి విషయం గురించి మాట్లాడుకుంటారు. వయసులో పెద్ద పిల్లలు చిన్న పిల్లలకు అనేక విషయాలు చెబుతారు. చిన్న పిల్లలు కుతూహలంగా విని తెలుసుకుంటారు. ఈ 'చెప్పడం వినడం' అనేది వేసవి సెలవుల డాబా నిద్రల్లో అద్భుతంగా సాగుతుంది.

మూసి ఉన్న ఇళ్ల నుంచి, మూసి ఉన్న తరగతి గదుల నుంచి ఆరుబయలుకు వచ్చి స్వేచ్ఛాకాశం కింద నిద్రపోవడం వేసవిలో పిల్లలకు కొత్త అనుభూతిని ఇచ్చి అందాకా అనుభవించిన బోర్‌డమ్‌ను తొలగిస్తుంది. అందుకే నగరాల్లో బాలల సైకియాట్రిస్టులు స్లీపోవర్లను ప్రోత్సహిస్తున్నారు. ఒకప్పుడు బంధువుల పిల్లలతో వేసవిలో సాగిన సామూహిక నిద్రలు ఇప్పుడు కరువవడంతో కనీసం ఏదో ఒక ఫ్రెండ్ ఇంట్లో పిల్లలంతా ఒక రాత్రి నిద్రపోవడానికి చేరి కబుర్లు చెప్పుకుని ఒత్తిడి దూరం చేసుకోమంటున్నారు.

చదవక ముందు పెసలు, చదివాక పిసలు అయినట్టుగా మన దగ్గర వందల సంవత్సరాలుగా ఉన్న పద్ధతి ఇప్పుడు శాస్త్రంగా వినాల్సి వస్తోంది. పిల్లలు ఎన్ని జోకులు వేయగలరో, ఎన్ని మిమిక్రీలు చేయగలరో, ఎన్ని వెక్కిరింతలు లోపల దాచుకుని ఉంటారో, ఎంత అబ్జర్వ్ చేసి ఉంటారో ఇవన్నీ తమ మనుషులతో తమకంటూ సమయం దొరికినప్పుడు బయటకు వెల్లడి చేస్తారు. కజిన్స్‌తో వేసవి నిద్రల్లో ఏముంది అనుకోవచ్చు నేడు. అదొక కౌన్సెలింగ్. అదొక వైద్యం. అదొక డీటాక్సినేషన్. వెన్నెలా చంద్రుడూ అందించే 'ఎస్' విటమిన్. ఎస్ అంటే సంతోషం. వేసవి సంబరం.

హెల్త్

బెడ్ వెట్టింగ్ కట్టడి..!



సాధారణంగా చిన్నారులు నిద్రలో పక్కతడుపుతుంటారు. మూత్రవిసర్జన వ్యవస్థపై అదుపు చేకూరక అలా జరుగుతుంది. అయితే పిల్లలు క్రమంగా మూత్రవిసర్జనపై అదుపు సాధించడం మొదలయ్యాక ఈ సమస్య తగ్గుతుంది. సాధారణంగా ఏడు నుంచి ఎనిమిదేళ్ల వయసు వచ్చేనాటికి పిల్లలు తమ మూత్ర విసర్జన కండరాలూ, వ్యవస్థపై అదుపు సాధించాక ఈ సమస్య పూర్తిగా తగ్గుతుంది. ఇలా పక్కతడిపే ఈ సమస్యను వైద్యపరిభాషలో 'నాక్టర్నల్ ఎన్యురిసిస్' అంటారు. అయితే కాస్త అరుదుగానైనా పెద్దపిల్లలతో పాటు కొందరు పెద్దల్లో కూడా ఈ సమస్య ఉండవచ్చు. ఈ సమస్య ఎందుకు వస్తుంది, దాన్ని అధిగమించడమెలా అనే అంశాలను తెలిపేదే ఈ కథనం.

ఒక నిర్వచనాన్ని బట్టి చెప్పాలంటే... ఐదేళ్లకు పైబడిన పిల్లలు వారంలో రెండుసార్లు పక్కతడుపుతుంటే దాన్ని బెడ్ వెట్టింగ్‌గా చెప్పవచ్చు.

ఇదీ విస్తృతి...

బెడ్ వెట్టింగ్ సమస్య వేర్వేరు వయసుల వాళ్లలో వేర్వేరుగా ఉంటుంది. ఉదాహరణకు...

- చిన్నపిల్లల్లో: ఐదేళ్ల పిల్లల్లో దాదాపు సుమారు 15-20% మందిలో నాక్టర్నల్ ఎన్యూరిసిస్ కనిపిస్తుంది. అమ్మాయిలతో పోలిస్తే అబ్బాయిల్లో ఈ సమస్య కాస్త ఎక్కువ.
- కాస్తంత పెద్ద పిల్లల్లో: పిల్లలకు ఏడేళ్లు వచ్చే నాటికి 15% - 20% ఉన్న దీని విస్తృతి దాదాపు 10 శాతానికి తగ్గుతుంది.
- కౌమార బాలల్లో (అడాలసెంట్ పిల్లల్లో): 13-18 ఏళ్ల పిల్లల్లో ఇది 1 - 3 శాతం వరకు ఉంటుంది.
- పెద్దలలో: కొందరు పెద్ద వయసువారిలోనూ ఈ సమస్య కనిపించవచ్చు. అయితే వాళ్లలో ఇది పిల్లల్లో కంటే కాస్త భిన్నంగా ఉంటుంది. ఉదాహరణకు పిల్లల్లో కనిపించే పక్క తడిపే సమస్యను ప్రైమరీ అన్యురిసిస్ అంటారు. అయితే పెద్దల్లో ఇదే సమస్య కనిపించే దాన్ని సెకండరీ నాక్టర్నల్ ఎన్యురిసిస్‌గా చెబుతారు. పెద్దవయసు వాళ్లలోని కనీసం 1 - 2 శాతం వ్యక్తుల్లో ఈ నాక్టర్నల్ ఎన్యురిసిస్ కనిపిస్తుందని అంచనా. ఇలా పెద్దల్లో ఈ సమస్య రావడానికి ఇతరత్రా కారణాలు ఉండవచ్చు. కాబట్టి దీన్ని సెకండరీ అన్యురిసిస్‌గా చెబుతారు.

కారణాలు...

- ప్రైమరీ ఎన్యురిసిస్‌లో: పిల్లలకు నిద్రలో తమ మూత్ర విసర్జన వ్యవస్థపై నియంత్రణ లేకపోవడమన్నది మామూలు కారణం. దీనికి ఇతరత్రా ఏవైద్య కారణాలూ ఉండవు.
- జన్యుపరమైనవి: కుటుంబాల్లోని వారికి తమ బాల్యంలో ఈ సమస్య ఉంటే పిల్లల్లోనూ ఈ సమస్య కనిపిస్తుంది.
- గాఢనిద్ర కారణంగా: బ్లాడర్ నిండినట్లుగా అందే సూచనలను తమ గాఢనిద్ర కారణంగా వాళ్లు స్వీకరించలేకపోవడం.
- మూత్రాశయం చిన్నగా ఉండటంతో నిల్వ సామర్థ్యం తగ్గడం.
- సెకండరీ ఎన్యురిసిస్: చిన్నారుల్లోగానీ, అలాగే పెద్దవాళ్లలోనూ ముందుగా కొంతకాలంపాటు పక్క తడిపే అలవాటు లేకుండా... అకస్మాత్తుగా కనిపించడం. ఉదాహరణకు పక్కతడిపే అలవాటు మానేశాక కనీసం ఆర్నెల్ల పాటు పక్కలో మూత్రవిసర్జన చేయకుండా... ఆ తర్వాత ఆ ధోరణి కనిపించడాన్ని 'సెకండరీ అన్యురిసిస్'గా చెప్పవచ్చు. ఇందుకు అనేక అంశాలు కారణం కావచ్చు. అవి...
- ఒత్తిడి లేదా భావోద్వేగ సమస్యలు: పిల్లల్లో ఆందోళన, బడిలో ఏవైనా తీవ్రమైన ఒత్తిళ్లు ఉండటం. మూత్ర వ్యవస్థలో ఎక్కడైనా ఇన్ఫెక్షన్లు (యూరినరీ ఇన్ఫెక్షన్స్)
- మలబద్ధకం లేదా పేగు సమస్యలు.
- స్లీప్ ఆప్నియా (గురక రావడం) లేదా ఇతరత్రా నిద్ర సంబంధ ఆరోగ్య సమస్యలు.
- డయాబెటిస్ లేదా ఇతరత్రా హార్మోన్ల అసమతౌల్యతల (ఉదా... యాంటీ డై-యూరెటిక్ హార్మోన్ లోపం).

తల్లిదండ్రులకు సూచన...

ఇది చాలా సాధారణమైన పిల్లల్లో సహజంగా కనిపించే అలవాటు. ఇలా చేసినప్పుడు పిల్లలను కోప్పడటం లేదా వారిని శిక్షించడం సరికాదు. దీనివల్ల మరింత ఒత్తిడి పెరగడం, సమస్య ఇంకాస్త తీవ్రం కావడం జరుగుతుంది. ఇది చాలా తాత్కాలికమైన సమస్య అనీ, దీని గురించి ఆందోళన అవసరం లేదంటూ పిల్లల్లో మానసిక స్థైర్యం కలిగించడం వల్ల ఈ సమస్య వీలైనంత త్వరగా తగ్గుతుంది.

సమస్య నిర్ధారణ ఇలా...

- రాత్రివేళల్లో మూత్రవిసర్జన వల్ల సమస్య స్పష్టంగా తెలుస్తుంది.
- బాధిత చిన్నారులను శారీరకంగా పరిశీలించడం. మెడికల్ హిస్టరీని డాక్టరుకు వివరించడంతో కొన్ని రకాల మూత్ర పరీక్షలు అవసరమవుతాయి.
- మూత్ర విసర్జన వివరాలతో డైరీ: పిల్లలు నీళ్లు ఏయే వేళల్లో తాగుతున్నారు, మూత్రవిసర్జన ఎప్పుడెప్పుడు చేస్తున్నారు వంటి విషయాలను నమోదు చేస్తూ ఓ డైరీ రాయడం.
- శారీరక పరీక్ష: మూత్ర నాళం, వెన్నెముక, నాడీ వ్యవస్థలో ఏవైనా లోపాలున్నాయా అని పరీక్షించడం.
- యూరిన్ అనాలసిస్: మూత్ర సంబంధిత ఇన్ఫెక్షన్లుగానీ, డయాబెటిస్ లేదా కిడ్నీ సమస్యలేమైనా ఉన్నాయా అని పరీక్షించడం. అవి లేనప్పుడు వాటిని రూల్ అవుట్ చేసుకోవడం.
- అల్ట్రాసౌండ్ పరీక్ష: మూత్ర వ్యవస్థ, యూరినరీ బ్లాడర్, మూత్రపిండాల వివరాలను తెలుసుకోవడానికి ఉపయోగపడే పరీక్ష ఇది.
- అదనపు పరీక్షలు: ప్రైమరీ అన్యురిసిస్ కాకుండా ఇతరత్రా ఏవైనా కారణలు ఉండవచ్చునని అనుమానించినప్పుడు హార్మోన్ల మోతాదులు, స్లీప్ ఆప్నియా వంటి అంశాల నిర్ధారణ కోసం చేయాల్సిన స్లీప్ స్టడీస్ వంటి పరీక్షలు.

నివారణ ఇలా...

ప్రాథమిక కారణాలు తెలిసినప్పుడు వాటిని నివారించడానికి ప్రయత్నించడం. ఉదాహరణకు పిల్లల్లో తీవ్రమైన ఒత్తిడి కారణంగా ఇలా జరుగుతుందని తెలిసినప్పుడు తల్లిదండ్రులు కౌన్సెలింగ్ ద్వారా ఆ ఒత్తిడిని, ఆందోళనను తగ్గించడం.

- మూత్ర విసర్జన శిక్షణ (టాయిలెట్ ట్రైనింగ్): పిల్లలు నిద్రకు ఉపక్రమించే ముందర ఒకసారి మూత్రవిసర్జన చేయించి, మళ్లీ రెండు గంటల తర్వాత నిద్రలేపి మరో మారు మూత్రవిసర్జన చేయించడం లాంటి చర్యల ద్వారా. అలాగే పిల్లల్లో మూత్రాశయ సామర్థ్యాన్ని పెంచడం కోసం రోజూ ఓ నిర్ణీతమైన వేళల్లో మూత్ర విసర్జన చేసేలా శిక్షణ ఇవ్వడం.
- ఒత్తిడి దూరం చేయడం: రాత్రి వేళ పిల్లలు ప్రశాంతంగా నిద్రపోయేలా వారికి ధైర్యం చెప్పడం.
- ఎన్యూరిసిస్ అలారం ఉపకరణాలతో: పిల్లలు కొద్దిగా పక్కతడుపడం మొదలుపెట్టగానే వాటిని గుర్తించి నిద్రలేపే అలారం ఉపకరణాలు అందుబాటులో ఉన్నాయి. వీటి సహాయంతో పిల్లవాడు నిద్రమేల్కొనేలా శిక్షణ ఇవ్వడం.
- జీవనశైలి మార్పులు: సాయంత్రాలు లేదా రాత్రివేళల్లో ద్రవాహారాలు తీసుకోకుండా జాగ్రత్త పడటం. అలాగే నిద్రకు ముందు కాఫీ లేదా కోలా డ్రింక్స్ వంటి పానీయాలు తీసుకోకుండా చూడటం.

మరేవైనా కారణాలతో ఇలా జరుగుతుంటే...

సాధారణ కారణాలు కాకుండా... ఇతర ఆరోగ్యపరమైన అంశాలేవైనా పక్క తడిపేందుకు కారణమవుతుంటే వాటిని గుర్తించి, ఆ సమస్యలకు చికిత్స అందిస్తే పక్కతడిపే అలవాటూ తగ్గుతుంది. ఉదాహరణకు నిద్ర రుగ్మతల కారణంగానో లేదా మానసిక సమస్యల వల్లనో ఇలా జరుగుతుంటే వాటిని గుర్తించి, తగిన చికిత్స అందించడం వల్ల సెకండరీ అన్యురిసిస్ అదుపులోకి వస్తుంది. ఇక సమస్య పెద్దవాళ్లలో అయితే అది సెకండరీ అన్యురిసిస్ కారణంగా జరుగుతుంది కాబట్టి తగిన పరీక్షల తర్వాత సమస్యను బట్టి వారికి అందించాల్సిన చికిత్స ఉంటుంది.

మందులతో నియంత్రణ ఇలా...

డెస్మోప్రెసిన్: రాత్రివేళ మూత్రం ఉత్పత్తిని తగ్గించే మందులివి. (వీటిని కృత్రిమంగా ఉత్పత్తి చేసే యాంటీ డై యూరెటిక్ హార్మోన్‌లుగా చెప్పవచ్చు).

ఇమిప్రమైన్ (టోఫ్రానిల్): పిల్లల్లో ఒత్తిడిని తగ్గించడానికి ఉపయోగించే యాంటీ డిప్రెసెంట్ ఔషధాలివి.

ఆక్సిబ్యూటినిన్: మూత్రాశయం ఉండాల్సిన దానికంటే అతి చురుగ్గా ఉన్నప్పుడు దాన్ని నియంత్రించే మందు ఇది.



డా. మధు మోహన్ రెడ్డి,
సీనియర్ కన్సల్టెంట్
పీడియాట్రిక్ సర్జన్

నోటి క్యాన్సర్ నిర్ధారణ ఇలా!





నోటి పరిశుభ్రత పెద్దగా పాటించకుండా గుట్కా, ఖైనీల రూపంలో పొగాకు నమలడం, ఆల్కహాల్ తీసుకోవడం వంటి అంశాలు నోటి క్యాన్సర్‌ను ప్రేరేపిస్తాయి. ఇలాంటివారిలో చెంపలు, నాలుక, పంటి చిగుర్లు... వంటి భాగాలను పరీక్షించి ఏ భాగంలో క్యాన్సర్ వచ్చిందో క్యాన్సర్ స్పెషలిస్టు పరీక్షించి చూస్తారు. వీళ్లలోని కొందరిలో నోటిలో వాపు కూడా రావచ్చు. అప్పుడు కూడా దాన్ని క్యాన్సర్‌గా అనుమానించాల్సి ఉంటుంది.

మొదట సమస్య ఉన్నచోట, మెడ భాగంలోనూ సీటీ, ఎమ్మారై స్కానింగ్ వంటి పరీక్షలు చేయించి, క్యాన్సర్ వ్యాధి తీవ్రతను అంచనా వేస్తారు. ఈ పరీక్షల వల్ల పుండు పడిన చోటు నుంచి అది ఏ మేరకు వ్యాపించి ఉందో తెలుస్తుంది. అది దవడ ఎముకను చేరిందా, లేక ఎముకను దాటి మెడలోని లింఫ్ గ్రంథులకూ వ్యాపించిందా అన్న విషయాన్ని కూడా డాక్టర్లు తెలుసుకుంటారు. పేషెంట్ నోటిని మామూలుగానే తెరవగలుగుతున్నాడంటే, క్యాన్సర్ దవడ కండరాల్లోకి వ్యాపించి ఉండకపోవచ్చు. ఎందుకంటే క్యాన్సర్ దవడ కండరాల్లోకి వ్యాపిస్తే నోరు తెరవడం కష్టమవుతుంది.

నోటిలోని క్యాన్సర్ ఇతరచోట్లకు వ్యాపించకపోతే మొదట క్యాన్సర్ వచ్చిన మేరకు ఆ భాగాన్ని శస్త్రచికిత్సతో తొలగించాల్సి ఉంటుంది. ఆ తర్వాత... ప్లాస్టిక్ సర్జరీ లేదా రీ-కన్‌స్ట్రక్టివ్ సర్జరీ ద్వారా తొలగించిన భాగాన్ని పునర్నిర్మించవచ్చు. ఒకవేళ మెడలోని లింఫ్ గ్రంథుల్లోకి కూడా క్యాన్సర్ వ్యాపించి ఉంటే, వాటన్నింటినీ నెక్ డిసెక్షన్ ద్వారా తొలగించాల్సి ఉంటుంది. బయాప్సీ రిపోర్టు ఆధారంగా శస్త్రచికిత్స తాలూకు గాయాలు మానాక, రేడియోథెరపీ ప్లాన్ చేస్తారు.

నోటి క్యాన్సర్ అన్నది చాలా బాధాకరమైనది కావడం వల్ల గుట్కా/పొగాకు అలవాటు ఉన్నవారు వెంటనే దాన్ని మానేయాలి. ఈ అలవాటు కేవలం నోట్లోని భాగాలకే కాకుండా మెడ, ఆహారనాళం లేదా కడుపులోని ఏ భాగానికైనా క్యాన్సర్ వచ్చేలా చేయగలదన్న విషయం గుర్తుంచుకుని జాగ్రత్త పడాలి.